

ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠకు విరాళం

ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠకు కొవ్వూరి వెంకట నాగరెడ్డి, అనిత దంపతులు (రావులపాలెం) రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు నూనె రామకృష్ణ, కనకదుర్గా భాయి దంపతులు(తాడేపల్లిగూడెం) గురువారం రూ.1.01 లక్షలు విరాళంగా సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
42.0° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	26.5
కాకినాడ	38.5	27.8
అమలాపురం	37.0	26.0

న్యూస్‌రీల్

గ్రూప్-1 మెయిన్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ రాత పరీక్ష శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 10వ తేదీ వరకు జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. 46 మందిఅభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, చీఫ్ సూపరింటెండెంటు, ఇతర అధికారుల నియామకం పూర్తయ్యిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఒరిజినల్ ఫొటో, గుర్తింపుకార్డు, బాల్‌పాయింట్ పెన్ను మాత్రమే తీసుకుని రావాలన్నారు. ఎటువంటి ఇతర కాగితాలు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు, రిస్టు వాచ్‌లు, కాలిక్యులేటర్‌ను అనుమతించరన్నారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 నుంచి 9.45 గంటల లోపు అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు బయోమెట్రిక్ రిజిస్ట్రేషను, ఫేస్ రికగ్నిషన్, తనిఖీ ఉదయం 9.45లోగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ వివరించారు.

నేటి నుంచి పది సప్లమెంటరీ పరీక్షలు



కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ.కాకినాడ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 10వ తేది వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాలు ఏర్పాటు చేశారు.10,719 మంది విద్యార్థులు రాయనున్నారు. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ విద్యార్థులను కూడా రెగ్యులర్‌గానే పరిగణించనున్నారు. పరీక్షల కోసం 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లను ,38మంది డీవోలతో పాటు 400 మంది ఇన్విజిలేటర్లు నియమించారు. కేంద్రాల్లో అసౌకర్యం కలగకుండా విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ చెప్పారు.

మల్లిసాల ఫ్రూట్ ఇండస్ట్రీలో తనిఖీలు



ఫుడ్ ఇండస్ట్రీని తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగ్గంపేట: మల్లిసాలలోని మహాలక్ష్మి ఫ్రూట్ ఇండస్ట్రీలో కాకినాడ ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. మహాలక్ష్మి ఫ్రూట్ ఇండస్ట్రీలో కుళ్లిపోయిన మామిడికాయలు వాడడంతోపాటు రసాయన పదార్థాలు వినియోగిస్తున్నారని, పరిశుభ్రత పాటించడం లేదని కాకినాడ కలెక్టర్ స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్టు కాకినాడ ఫుడ్‌సేఫ్టీ అధికారి నాగుల మీరా తెలిపారు. ఈ తనిఖీల్లో మామిడ తాండ్ర, మామిడి జ్యూస్ శాంపిల్స్‌ను సేకరించి నాచారంలో ల్యాబ్‌కు పంపుతున్నట్టు ఆయన చెప్పారు. ల్యాబ్ రిపోర్ట్స్‌ను బట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయన్నారు.

జేకేసీ సూపర్ హిట్

- 'జగనన్నకు చెబుదాం' ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు పెరుగుతున్న కాల్స్
- పరిష్కారంతో అర్జీదారుల సంతృప్తి
- కాకినాడ జిల్లాకు మూడో స్థానం
- నిర్ధారించిన ఆడిట్ నివేదికలు



కాకినాడ : స్పందనలో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



సాక్షిప్రతినిధి,కాకినాడ: ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి జగనన్నకు చెబుదాం (జేకేసీ) మరింత తోడుగా నిలుస్తోంది. గత పాలనలో అర్జీలు ఇవ్వడమే తప్ప పరిష్కారంపై అర్జీదారునికి తదుపరి సమాచారం స్పష్టంగా తెలిసేది కాదు. ఈ విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆచరణాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో జరిగే స్పందనలో అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి ఇబ్బందులు పడుతూ జిల్లా కేంద్రానికి రావడం కష్టమనే భావనతో కలెక్టర్లు చొరవ తీసుకుని స్పందనను మరింత చేరువగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఏడాదిగా ఈ విధానం విజయవంతంగా అనుసరిస్తున్నారు.

స్వల్ప వ్యవధిలోనే సత్ఫలితాలు

స్పందన ఉన్నప్పటికీ అక్కడక్కడా అసంతృప్తి ఎదురవుతోంది. దీనిని సంతృప్తి స్థాయికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలలో ఎక్కడైనా తేడా వస్తే నేరుగా తనకే తెలియజేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం గత నెల 9న జగనన్నకు చెబుదాం (జేకేసీ) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల్లో ఎదురయ్యే సమస్యలను నేరుగా 1902 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేస్తే పరిష్కరించేలా కొత్త వ్యవస్థను తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ఆశించిన దానికంటే ఎక్కువగా సత్ఫలితాలనిస్తోంది. ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసిన వెంటనే పరిష్కారం లభిస్తుండటంతో ప్రజలు కూడా సంతృప్తి చెందుతున్నారు. గత నెల 9 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జిల్లాల వారీగా వచ్చిన కాల్స్, అర్జీదారుల సంతృప్తకర స్థాయిని ఆడిట్ చేశారు. దీంతో సంతృప్త స్థాయిని గణాంకాలతో నిర్ధారించారు.

సంతృప్త స్థాయి...

జిల్లా	కాల్స్	సంతృప్తి	శాతం
కాకినాడ	106	71	67
తూర్పుగోదావరి	89	46	52
కోనసీమ	82	42	51

జిల్లాల వారీగా వచ్చిన కాల్స్..

జిల్లా	మొత్తం	స్కీమ్స్	నాన్‌స్కీమ్	ఇతర సమస్యలు
కాకినాడ	6,086	1,569	921	3,597
తూర్పుగోదావరి	17,690	4,610	2,631	10,449
కోనసీమ	4,973	1,159	762	3,052

పథకాల లబ్ధికి వినతులు

జేకేసీ కాల్స్‌లో అత్యధికం పేదలందరికీ ఇళ్లు, జగనన్న వసతిదీవెన, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక వంటి వాటికి సంబంధించినవి వచ్చాయి. వీటితో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల్లో ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షిస్తోన్న విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై కూడా ఎక్కువగా కాల్స్ వచ్చాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నట్టు ఎక్కువ మంది వినియోగదారులు 1902కు కాల్ చేశారు. తూర్పుగోదావరి నుంచి మురుగుకాల్వల్లో సిల్ట్ తొలగింపు, డ్రైనేజీల నిర్వహణపై కాల్స్ ఎక్కువగా వచ్చాయి. ఇలా వచ్చిన కాల్స్‌కు వెనువెంటనే పరిష్కారం చూపుతుండటంతో కాలర్స్(ప్రజలు) సంతృప్తి చెందుతున్నారు. అందుకే జేకేసీకి స్వల్ప వ్యవధిలోనే విస్తృతమైన ప్రచారం లభించింది. కాల్స్ పెరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

తాజాగా జేకేసీపై ఆడిట్

ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్ నేరుగా సీఎం డ్యాష్ బోర్డుకు వెళ్తున్నాయి. అవి తర్వాత జిల్లా స్థాయిలో కలెక్టర్ వద్దకు వస్తున్నాయి. వారు స్వయంగా పర్యవేక్షిస్తూ పరిష్కారం చూపుతున్నారు. దీంతో అర్జీదారులు నూరుశాతం సంతృప్తి చెందుతున్నారు. తాజాగా రాష్ట్ర స్థాయిలో జేకేసీపై ఆడిట్ జరిగింది. అత్యధిక కాలర్స్ (అర్జీదారులు) సంతృప్తి చెందిన జిల్లాల్లో కాకినాడ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది.

అనూహ్య స్పందన



'జగనన్నకు చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్‌కు వెంటనే పరిష్కారం చూపుతున్నాం. 1902 టోల్‌ఫ్రీ నంబర్‌పై జనంలో బాగా నమ్మకం పెరిగింది. వారు చాలా సంతృప్తి చెందుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న కాల్స్ ఇందుకు నిదర్శనం. కాల్స్‌పై క్షేత్ర స్థాయిలో యంత్రాంగంతో పరిశీలన జరిపించి వెంటనే పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. నాణ్యమైన పరిష్కారం లభించిందా లేదా, అది ఏ స్థాయిలో జరిగింది, సమస్యను ఎదుర్కొంటున్న వారు సంతృప్తి చెందారా లేదా తదితర అంశాలపై ఆడిట్ కూడా జరుగుతోంది. కాకినాడ జిల్లా రాష్ట్రంలో జేకేసీ సంతృప్తస్థాయి విషయంలో మూడో స్థానంలో ఉండడం సంతోషంగా ఉంది.

– కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ.

కాల్ చేయగానే పరిష్కారం





జేకేసీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఒక్క ఫోన్ కాల్ చేస్తే మా సమస్య పరిష్కారమైంది. గతంలో అధికారులకు చెప్పాను. చూసి వెళ్లారు. మా గ్రామ పంచాయతీ పరిధిలో కొన్ని రోజులుగా డ్రైనేజీలో మురుగునీరు పేరుకుపోయింది. రోడ్డంతా పెద్ద పెంటకుప్పలుగా మారింది. దుర్గంధ భరితంగా తయారైంది. ఈ సమస్యపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం దొరకలేదు. ఈ మధ్య జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియపరిచాను. సకాలంలో స్పందించారు. కలెక్టర్ వెంటనే అధికారులను మా గ్రామానికి పంపించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించడం చాలా సంతృప్తినిచ్చింది.

– మళ్ల సీతారామరాజు, సోమరాయణంపేట, కిర్లంపూడి మండలం.

48 గంటల్లోనే స్పందన





నేను హైదరబాద్‌లో వాచ్‌మన్‌గా ఉంటున్నాను. నా భార్య.. ఇద్దరు పిల్లల స్వగ్రామంలో ఉంటున్నారు. ఈ మధ్య కోతులు పిల్లలపై దాడి చేస్తున్నాయి. భయపడి పరుగు పెడుతూ పడిపోయి గాయపడ్డా. జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబర్ గురించి తెలుసుకున్నాను. 1902కు కాల్ చేశాను. 24 గంటల్లో గ్రామ సచివాలయం అధికారి వచ్చారు. కోతుల సమస్య వెంటనే పరిష్కరిస్తామన్నారు. కోతుల్ని పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించారు. 48 గంటల్లోనే సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– వై.శ్రీను, పైన, పెదపూడి మండలం.

రత్నగిరిపై గైడ్ల దందాకు చెక్

పశ్చిమ రాజగోపురం వద్ద హోం గార్డుల నియామకం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు స్వామివారి వ్రతం, దర్శనం చేయిస్తామని వందలాది రూపాయలు వసూలు చేసి దందాకు పాల్పడుతున్న గైడ్లు (దళారీలు) గురువారం పశ్చిమరాజగోపురం వద్ద కనిపించలేదు. వీరికి అడ్డుకట్ట వేయాలని రాజగోపురం వద్ద నలుగురు హోంగార్డులను నియమించడమే ఇందుకు కారణం. ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈమేరకు చర్యలు తీసుకున్నారు. గైడ్లను ఆ పరిసరాల నుంచి గార్డులు పంపించేశారు. గైడ్లు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఇస్తే నేరుగా స్వామివారి దర్శనం చేయిస్తామని భక్తులను నమ్మించేవారు. తరువాత వారిని ఆలయం వద్దకు తీసుకువెళ్లి అక్కడ సిబ్బందితో మాట్లాడి టిక్కెట్ తీయకుండా అంతరాలయంలోకి పంపించేవారు. వీరికి కొంతమంది సిబ్బంది సహకరించేవారనే విమర్శ ఉంది. బుధవారం స్వామివారి ఆలయ పరిసరాలను పరిశీలించిన ఈఓ కు ఈ గైడ్ల గురించి తెలుసుకున్నారు.పశ్చిమ రాజగోపురం వద్ద గైడ్లను రానీయవద్దని వెంటనే ఆదేశించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉండి గైడ్లను రానీయకుండా చూడాలని ఆదేశించారు.రూ.200 దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులను స్వామివారి గర్భాలయం ప్రదక్షిణానంతరం అంతరాలయం దర్శనం చేసుకోవచ్చునని మైకు ద్వారా ప్రకటించారు. గతంలో కూడా ఈఓలు గైడ్లను నియంత్రించారు. కానీ వీరిని అనుమతించాలని పలువురి నుంచి ఒత్తిళ్లు రావడంతో వదిలేసేవారు. ప్రస్తుతం అలాంటి ఒత్తిడి వచ్చే అవకాశముందని సమాచారం.



పశ్చిమ రాజగోపురం వద్ద హోంగార్డులు కాపలా

వ్యవసాయంలో విప్లవాత్మక విధానాలు

- అన్నదాత పక్షాన రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్ రైతు భరోసా సాయం విడుదల
- కార్యక్రమంలో ఎంపీ వంగా గీత
- పాల్గొన్న కలెక్టర్..ఎమ్మెల్యే కన్నబాబు



రైతులకు వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్, ఇన్‌ఫుట్ సబ్సిడీ మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ సిటీ: సాగును లాభసాటిగా మార్చి రైతుకు గౌరవం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక విధానాలను అమలు చేస్తోందని ఎంపీ వంగా గీత అన్నారు. వరుసగా అయిదో ఏడాది మొదటి విడత వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఆర్థిక సహాయాన్ని, పెట్టుబడి రాయితీని అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా స్థాయిలో కృషిభవన్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్‌పర్సన్ ఎల్ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఎన్ విజయకుమార్‌లతో కలిసి ఎంపీ గీత పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతుల నుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయదారులు బాగుంటే దేశం బాగుంటుందనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారని ఎంపీ పేర్కొన్నారు. జూన్ 1నే ఖరీఫ్‌కి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో రైతులు మూడు పంటల దిశగా వెళ్లి వ్యవసాయ ఫలాలను పొందాలని ఆకాంక్షించారు.

పంట నష్ట పరిహారం కూడా చెల్లింపు

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద జిల్లాలోని 1,74,229 మంది రైతులకు దాదాపు రూ.131 కోట్ల మేర లబ్ధి కలుగుతోందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లాలో 884 హెక్టార్లలో పంట నష్టాలకు సంబంధించి 1220 మంది రైతులకు రూ.1.33 కోట్లు పరిహారం కూడా జమ చేశారన్నారు. ఈ-క్రాప్ డేటా ఆధారంగా నష్టాలు అంచనా వేసి వాస్తవ సాగుదారులందరికీ పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా, జవాబుదారీతనంతో లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. ముందస్తు నీటి విడుదల వల్ల గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి సమగ్ర సాగు నీటి ప్రణాళిక అమలుతో దాదాపు 35 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లకుండా కాపాడుకోగలిగామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈసారి రికార్డు స్థాయిలో మద్దతు ధరకు బోండాలు రకం ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

రైతు పక్షపాత ప్రభుత్వం

రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వమన్నారు. అన్నదాత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. తాను వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో ఈ పథకాలన్నీ రూపుదిద్దుకుననందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ ద్వారా రైతుకు వివిధ పథకాల ఫలాలునేరుగా అందుతున్నాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎల్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామ,మండల, జిల్లా స్థాయిల్లో వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. సమావేశంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు కలిసి వివిధ ప్రాంతాలకు చెందిన రైతులకు వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్, ఇన్‌ఫుట్ సబ్సిడీ మెగా చెక్కును అందజేశారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర సూర్యప్రకాశరావు, మత్స్యశాఖాధికారి పీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

ఏలేరులో దిగి యువకుడు గల్లంతు

జగ్గంపేట: ఏలేరు నదిలో స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. మర్రిపాకకు చెందిన 14మంది యువకులు సోమవారం భావవరం వద్ద అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఏలేరు నదిలో స్నానానికి దిగారు. కాస్సేపటికి వీరిలో వాసిరెడ్డి మాలేష్ అనే (18) అనే యువకుడు గల్లంతయ్యాడు. సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు ఏలేరు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు ఎస్సై తెలిపారు. మాలేష్ ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్షలు రాశాడు. ఖాళీ సమయంలో ఊరిలో తాపీ పనికి వెళ్తుంటాడని స్థానికులు తెలిపారు. తండ్రి సన్నిబాబు ట్రాక్టర్ డ్రైవర్. ఇతనికి ఇద్దరు మగపిల్లలు. మాలేష్ రెండో కుమారుడు.



భావవరం వద్ద ఏలేరు నదిలో గల్లంతు అయిన వాసిరెడ్డి మాలేష్

ఆహ్లాద మహేంద్రి..!

- సుందర, హరిత నగరంగా జిల్లా కేంద్రం
- ఆహ్లాదం పంచేందుకు కార్పొరేషన్ కృషి
- అధ్వాన పార్కుల సుందరీకరణకు చర్యలు
- ఇప్పటికే పురోగతిలో వివిధ రకాల పనులు
- రూ.3 కోట్లతో గ్లోథీమ్ పార్క్ పనులు
- మరిన్ని పార్కుల గుర్తింపులో అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం చారిత్రాక నగరం. సాంస్కృతిక రాజధానిగా ప్రతీతి చెందిన ప్రాంతం. హోల్‌సేల్ వస్త్ర వ్యాణిజ్యానికి చుక్కాని. గత పదేళ్లలో వేగంగా విస్తరిస్తున్న వాణిజ్య కేంద్రం. ఐదు లక్షలకు పైగా ఉన్న జనాభా ఉన్న ఈ నగరంలో వారాంతంలో ఆహ్లాదంగా గడిపేందుకు అనువైన స్థలం లేదు. ఈ పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. సుందర, హరిత, ఆహ్లాద నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. పచ్చదనం పెంపొందించి, పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తోంది. వారంతంలో ప్రజలు, ఉద్యోగులు సరదాగా గడిపేందుకు ఆహ్లాదవాతావరణం నెలకొల్పుతోంది. ఇందుకు రూ.కోట్ల నిధులు వెచ్చిస్తోంది. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాల సమీపంలో అర్బన్ ఫుడ్ ప్లాజాను అందుబాటులోకి తెచ్చింది. పుష్కర ఘాట్ వద్ద పుష్కర ప్లాజా నిర్మాణం పూర్తయింది. మరిన్ని పార్కులను గుర్తించి వసతుల కల్పనకు మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం శ్రీకారం చుడుతోంది.

పర్యాటక కేంద్రంగా కంబాలచెరువు

నగరం నడిబొడ్డున ఉన్న కంబాల చెరువు పార్క్‌ను పర్యాటక మణిహారంగా తీర్చిదిద్దనున్నారు. 10 ఎకరాల్లో విస్తరించిన పార్కును ఆరెకరాల్లో చెరువు అభివృద్ధి చేసి బోటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. మరో నాలుగెకరాల్లో మిగిలిన వసతులు కల్పిస్తున్నారు. రెండు దశల్లో ఈ పనులు చేపట్టేందుకు రూ.13 కోట్లు వెచ్చించనున్నారు. బండ్ ప్రొటెక్షన్, వాల్ కాంపౌండ్, స్లోప్ డ్రెస్సింగ్, పనులు, వ్యూడెక్స్, అర్బన్ డెకరేటివ్ లైటింగ్, పేవర్స్ పాత్‌వే, జాగింగ్ ట్రాక్, పురుషుల జిమ్, సీటింగ్ గ్యాలరీ, వ్యూయింగ్ డెక్స్, జెన్ గార్డెన్, మెయిన్ ఎంట్రన్స్ ప్లాజా, ఓపెటీ జోన్, స్టేట్ ప్రైడ్ జోన్, చిల్డ్రన్ ప్లే ఏరియా జోన్, ప్లేకోర్ట్ జోన్ పనులు చేపట్టనున్నారు. తొలి దశలో ప్రస్తుతం రూ.5 కోట్లతో బండ్ ప్రొటెక్షన్ పనులు పూర్తయ్యాయి. స్లోప్ డ్రెస్సింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రూ.2 కోట్ల రుడా(రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) నిధులతో మ్యూజికల్ ఫౌంటేన్ పనులు ప్రారంభమయ్యాయి. వీటిని ఆర్‌బీ బొరా బ్రైట్ ఇన్‌ఫ్రా సంస్థకు అప్పగించారు.



రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు పార్కు

చొడేశ్వర్ నగర్‌లో గ్లోథీమ్ పార్క్

చొడేశ్వర్ నగర్‌లోని గ్లోథీమ్ పార్క్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రూ.3 కోట్లతో వసతుల కల్పనకు మార్గం సుగమమైంది. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రూ.90 లక్షలతో సివిల్, రూ.2 కోట్ల విద్యుత్ పనులు చేపడుతున్నారు. 300 మీటర్ల వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకురానున్నారు. పార్కు అభివృద్ధి పూర్తయితే సుందరీకరణలో రాష్ట్రంలోనే మొదటి, దేశంలోనే మూడోదిగా ఖ్యాతి గడించనుంది.



రాజమహేంద్రవరంలోని రూపుదిద్దుకున్న హ్యాపీ స్ట్రీట్

మరిన్ని పార్కుల గుర్తింపు

నగరంలో నిరుపయోగంగా, ఆలనా పాలన కరువైన పార్కులను మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ గుర్తిస్తున్నారు. వాటి అభివృద్ధికి, సుందరీకరణకు అడుగులు వేస్తున్నారు. పద్మావతి నగర్ పార్కులో నిర్వహిస్తున్న పనులు పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్, ఫుడ్‌కోర్ట్, గ్రీనరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏవీ నాగేశ్వరరావు పార్కు, ఏకేసీ కాలేజ్ పార్కు, గాంధీ పార్కులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నారు.

పాట్టలెక్కిన పుష్కర ప్లాజా

పుష్కర్ ఘాట్ సమీపం రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన వృథాగా ఉన్న స్థలం సుందర ప్రదేశంగా రూపుదిద్దుకుంది. 200 మీటర్లు పైబడి ఉండే ఈరోడ్డును పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. సందర్శకులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రదేశంలో ఆహ్లాదాన్ని నింపేలా సైన్‌బోర్డులు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

హ్యాపీ స్ట్రీట్

సెలవు సమయాల్లో సరదాగా గడిపేందుకు జేఎన్ రోడ్డులోని ఏకేజీ కళాశాల సమీపంలో అభివృద్ధి చేసిన హ్యాపీ స్ట్రీట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రూ.80 లక్షల వ్యయంతో ప్రజలను ఆకర్షించే ఆకృతుల్లో నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకు దేశంలో మహానగరాలకే పరిమితమైన హ్యాపీ స్ట్రీట్ మొట్ట మొదటి సారిగా రాజమండ్రిలో కొలువు దీరింది.

గాంధీ స్ఫూర్తికి నిదర్శనం దండీమార్చ్

మహాత్మాగాంధీకి రాజమహేంద్రవరానికి ప్రత్యేక అనుబంధం ఉంది. నగరానికి ఐదు సార్లు సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. ఆయనతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా దండీమార్చ్ రూపుదిద్దుకుంది. గాంధీ సత్యాగ్రహ స్ఫూర్తి ప్రజలు ఎల్లప్పుడూ స్మరించుకునేలా గాంధీ, ఇతర విగ్రహ నిర్మాణాలు చేపట్టారు. రూ.1.5 కోట్ల నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

సర్టిఫికెట్ల పరిశీలనకు 171 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలనకు 171మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం 58,001 నుంచి 74,000 ర్యాంకు వరకు గల విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సులను ఎంపిక చేసేందుకు ఆప్షన్లు నమోదు ప్రారంభమైందని తెలిపారు.

ఎప్పటికో మహా ప్రసాదం

- రూ.54 కోట్లతో రత్నగిరి 'ప్రసాద్' స్కీం కొత్త డీపీఆర్
- కీలకమైన ఐదు దశలు దాటిన పథకం
- లాంఛనాలన్నీ పూర్తయినా కరుణించని కేంద్ర పర్యాటక శాఖ



అన్నవరం: టెంపుల్ టూరిజం పేరుతో దేశవ్యాప్తంగా వివిధ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్న ప్రసాద్ (పిలిగ్రిమైజ్ రీజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ అగమెంటేషన్ డ్రైవ్) స్కీం అన్నవరం దేవస్థానానికి మంజూరై మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిపాలనా అనుమతి రాలేదు. ఈ నిధులతో దేవస్థానంలోని అన్నదాన భవనం, వ్రత మంటపాలు తదితర అత్యవసరమైన, భక్తులకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలనే అధికారుల ఆశ ఎప్పుడు నెరవేరుతుందో అర్థం కావడం లేదు. ఈ విషయమై కాకినాడ ఎంపీ వంగా గీత ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర టూరిజం శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి మరోమారు వినతి పత్రం అందజేశారు.

కేంద్ర ప్రభుత్వం వారణాసి, ఉజ్జయిని తదితర ఉత్తరాది రాష్ట్రాల పుణ్యక్షేత్రాలకు రూ.వందల కోట్లు ప్రసాద్ నిధులు కేటాయించి వాటిని నభూతో నభవిష్యతి అన్న చందంగా అభివృద్ధి చేసిన విషయం విదితమే. అదే విధంగా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే శ్రీశైలం, అమరావతి పుణ్యక్షేత్రాలకు ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరు అయ్యాయి. అన్నవరం దేవస్థానం ప్రతిపాదనలపై సుమారు మూడేళ్లు వివిధ దశలలో సమీక్షలు, సమావేశాల తరువాత ఈ స్కీం ద్వారా రూ.54 కోట్ల మంజూరుకు కేంద్ర టూరిజం శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇది జరిగి ఐదు నెలలైనా ఇంకా ఆదేశాలు వెలువడలేదు.

ఐదేళ్లుగా ఎదురు తెన్నులు...

ప్రసాద్ స్కీం రెండో దశలో అన్నవరం దేవస్థానానికి నిధులు మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు కోరింది. దేవస్థానం రూ.96 కోట్లకు ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర టూరిజం శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆ తర్వాత దేవస్థానానికి అత్యంత అవసరమైన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని రూ.54 కోట్లకు డీపీఆర్ తయారు చేశారు. దీనిపై కేంద్ర టూరిజం శాఖ అధికారులు తుది నివేదిక రూపొందించి గతేడాది సెప్టెంబర్‌లో కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి ఆమోదానికి పంపించారు. అక్కడ పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. ప్రసాద్ స్కీం మంజూరుకు ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అన్నదాన భవనం, వ్రత మంటపాల నిర్మాణం

ప్రసాద్ స్కీంలో తుది నివేదికలో రూ.30 కోట్లు వ్యయమయ్యే ప్రకాష్‌సదన్ సత్రం వెనుక మూడంతస్తుల అన్నదాన భవనం, టీటీడీ సత్రం స్థలంలో మూడంతస్తుల వ్రత మంటపం నిర్మాణాలను యథాతథంగా కొత్త డీపీఆర్‌లో ఉంచారు. కొండదిగువన డార్మెట్రీ, వనదుర్గ ఆలయం వద్ద నుంచి మొదటి ఘాట్‌రోడ్డును కలుపుతూ రింగ్ రోడ్డు, వ్రత మంటపం వద్ద నుంచి సత్యదేవుని ఆలయం వరకు భక్తులకు నడక దారి అభివృద్ధి వంటి నిర్మాణాల విషయంలో అంచనాలు కుదించనున్నారు. తొలుత ఈ పనులకు రూ. 20 కోట్ల వ్యయం అంచనా వేయగా దానిని రూ.పది కోట్లకు కుదించనున్నారు. రూ.8.5 కోట్ల వ్యయంతో కొండ దిగువన రెండు బ్లాకులుగా నిర్మించాలనుకున్న డార్మెట్రీని ఒక బ్లాక్ కే పరిమితం చేయాలని ఆలోచిస్తున్నారు. వనదుర్గ ఆలయం నుంచి మొదటి ఘాట్‌రోడ్ వరకు నిర్మించనున్న రింగ్ రోడ్డు నిర్మాణ వ్యయాన్ని కూడా కుదించే అవకాశం ఉంది. దీంతో బాటు భక్తులు క్యూలైన్‌లో అరగంట కన్నా ఎక్కువ సమయం నిలబడకుండా టీటీడీ తరహాలో కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయడం, అన్నదానంలో మెకనైజ్డ్ కుకింగ్, భక్తుల కోసం బ్యాటరీ కార్లు తదితర సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్మాణాలన్నీ ప్రసాద్ స్కీం తుది నివేదిక ప్రకారం రూ.54 కోట్లతోనే చేయాలని నిర్ణయించారు.

పెరుగుతున్న నిర్మాణ వ్యయ అంచనాలు

ఐదేళ్ల క్రితం దేవస్థానం పంపించిన ప్రతిపాదనల ప్రకారం నిర్మాణాలకు రూ.54 కోట్లు అవుతుండగా ప్రస్తుతం 15 శాతం పెరిగే అవకాశం ఉంది. కేంద్రం త్వరగా ప్రసాద్ స్కీంకు పరిపాలనా అనుమతి ఇస్తే టెండర్లు పిలిచే అవకాశం ఉంటుందని దేవస్థానం అధికారులు అంటున్నారు. దేవస్థానానికి రోజురోజుకి భక్తుల సంఖ్య పెరుగుతున్నందున ఇప్పుడు ఈ నిర్మాణాలు అత్యవసరం.

రత్నగిరిపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

జూలై ఒకటో తేదీ నుంచి అమలు

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జూలై ఒకటి నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ ను నిషేధిస్తూ ఈఓ చంద్రశేఖర్ అజాద్ గురువారం ఆదేశాలిచ్చారు. కేవలం గాజు సీసాలను మాత్రమే దేవస్థానంలో అనుమతించాలని ఆదేశించారు. ఇప్పటికే ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రిని దేవస్థానంలో నిషేధించామని తెలిపారు. కొండ మీద, కొండ దిగువన దేవస్థానం షాపులలో ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందిని ఈఓ ఆదేశించారు. రత్నగిరిని ప్లాస్టిక్ రహిత దేవస్థానంగా మార్చేందుకు దేవదాయశాఖ మంత్రి, కమిషనర్ల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

- ఆలయ టోల్‌గేట్ వద్ద వాహనాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తీసివేయాలని తనిఖీ సిబ్బందిని ఆదేశించారు.
- రత్నగిరిపై రోజూ వేయి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ విక్రయం
- రత్నగిరిపై సరాసరిన రోజుకు వేయి వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్నారు. ఈ బాటిల్స్‌లో సగానికి పైగా దేవస్థానంలోనే పారేస్తున్నారు. వీటిని తీసుకుని చెత్తతోబాటు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

తిరుమల తరహాలో..

తిరుమలలో గాజు వాటర్ బాటిల్ రూ.120కి విక్రయిస్తున్నారు. బాటిల్ తిరిగి ఇస్తే రూ.వంద ఇచ్చేస్తారు. ఇదే పద్ధతి అన్నవరం దేవస్థానంలో కూడా వ్యాపారస్తులు అమలు చేయాలని అధికారులు అంటున్నారు.

ముందస్తు నీటి విడుదలతో రైతన్నకు లబ్ధి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, హోంమంత్రి వనిత



స్విచ్ఆన్ చేసి డెల్టాలకు నీటిని విడుదల చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ. చిత్రంలో హోం మంత్రి వనిత, ఎమ్మెల్యే రాజా, కలెక్టర్ మాధవీలత తదితరులు

ధవళేశ్వరం: ముందస్తు నీటి విడుదలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, హోంమంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. వ్యవసాయాన్ని దైవంగా భావించే రైతులకు మేలు చేసే ఎన్నో నిర్ణయాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో చేసి వారి పక్షాన నిలిచారనివారు పేర్కొన్నారు. గురువారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మంత్రులు వేణుగోపాలకృష్ణ, వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఇరిగేషన్ సీఈ ఆర్.సతీష్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు తదితరులు గోదావరి జలాలను తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు విడుదల చేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గత ఏడాది జూన్ ఒకటో తేదీన నీటిని విడుదల చేయడం వలన ప్రకృతి విపత్తుల నుంచి రైతులు పంటను కాపాడుకోవడం సాధ్యమైందన్నారు. ఈ ఏడాది జూన్ 1న గోదావరి జలాలను విడుదల చేశామని పేర్కొన్నారు. గోదావరిలో అందుబాటులో ఉన్న ఎనిమిది వేల క్యూసెక్కుల నీటి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. గతంలో సుదీర్ఘకాలం పాలించిన వ్యక్తులకు రాని ఆలోచన యువకుడైన సీఎం జగన్ ఆచరణలో చేసి చూపించారన్నారు. ఆనాటి పాలకులు రూ.86,500 కోట్ల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం రూ.15వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. సీఎం జగన్ నాలుగేళ్లలో అవినీతికి ఆస్కారం లేకుండా రైతు భరోసాగా రూ.30,600 కోట్లు రైతుల ఖాతాలకు నగదు బదిలీ చేశారన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వానికి ఇదే నిదర్శనమన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రిజర్వాయర్లు నీటితో నిండు కుండల్లా సస్యశ్యామలంగా ఉన్నాయన్నారు. గత పాలకుల సమయంలో క్షామం ఏర్పడితే నేడు జగనన్న పాలనలో రైతులకు క్షేమం కలుగుతోందని పేర్కొన్నారు. హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగగా చేసిన ఘనత సీఎం జగనన్నకే చెల్లుతుందన్నారు. నేడు ముందస్తుగా నీటిని విడుదల చేయడం వలన సకాలంలో విత్తనాలు వేసేందుకు రైతులకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఈ దిశలో విత్తనం నుంచి విక్రయం వరకు ప్రతి అడుగులో రైతుకు అండగా భరోసాను కల్పిస్తున్నామన్నారు. సీఎం జగన్ ముందు చూపు వలనే సకాలంలో సాగు నీరు అందించడం సాధ్యమైందన్నారు. కలెక్టర్ కె మాధవీలత మాట్లాడుతూ ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన వ్యవసాయ కమిటీలను వేశామన్నారు. ఖరీఫ్‌లో ప్రతి రైతు సకాలంలో విత్తనాలు నాటే విధంగా ప్రాంతాల వారీగా నీటి విడుదలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. ఆర్బీకే స్థాయిలో సిబ్బంది ద్వారా రైతులకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తూ అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, ఇరిగేషన్ సీఈ ఆర్ సతీష్‌కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యులు కె.తేజ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి



ఆలయ సమీపంలోని బెంచీపై వెంకట్రావు మృతదేహం

గోకవరం: మండలంలోని సింగారమ్మతల్లి ఆలయం సమీపంలో పురుగు మందు సేవించి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామానికి చెందిన పెదపాటి వెంకట్రావు (38) కొద్ది రోజులుగా లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు అతన్ని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించగా లివర్ పూర్తిగా చెడిపోయిందని తెలిపారు. దీంతో మనస్థాపానికి చెందిన వెంకట్రావు బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చి సింగారమ్మ ఆలయం వద్దకు చేరుకుని మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం ఆలయ సమీపంలోని సిమెంటు బెంచీపై అతన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హైకోర్టు తాత్కాలిక సీజే శేషసాయికి ఘన స్వాగతం

నేడు సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించనున్న జస్టిస్



జస్టిస్ వేంకట శేషసాయికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కృత్తికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, ఈఓ అజాద్

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకట శేషసాయి గురువారం రాత్రి విచ్చేశారు. ఆయనకు దేవస్థానంలోని వినాయక అతిథి గృహం వద్ద కలెక్టర్ కృత్తికా శుక్లా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ అజాద్ ఘనంగా స్వాగతం పలికారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకట శేషసాయి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శిస్తారని అధికారులు తెలిపారు. దర్శనం అనంతరం వారికి వేద పండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు అందజేస్తారు. న్యాయమూర్తి బస చేసిన అతిథి గృహం వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు సీఐ కిషోర్ బాబు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

150 సీట్లతో మెడికల్ కళాశాల

- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం
- సీఎం జగన్ దృఢ సంకల్పంతోనే సాధ్యం
- మంత్రులు వేణు, వనిత

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని, జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచే 150 మెడికల్ సీట్లతో వైద్య కళాశాల అందుబాటులోకి రావడం ఇందుకు నిదర్శనమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచారం, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి సీహెచ్ వేణుగోపాలకృష్ణ, హోంమంత్రి, ప్రకృతి విపత్తుల శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది నుంచే 150 సీట్లతో బోధనాసుపత్రికి జాతీయ మెడికల్ కమిషన్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ మే 30న జారీ చేసిందన్నారు. ఈ మేరకు 2023 -24 నుంచి 150 మెడికల్ సీట్లు అందుబాటులో రానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో నూతనంగా 16 జిల్లాల పరిధిలో ప్రభుత్వ బోధనాసుపత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో మొత్తం 28 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రానుండటం జగనన్న వల్లే సాధ్యమైందని తెలిపారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ జిల్లాలో దశల వారీగా ఎన్నో అభివృద్ధి పనులు చేయడం, ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్లు, సంస్థలు రావడం సీఎం జగన్ వల్లనే సాధ్యమైందన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ వైద్య కళాశాల అనుమతి కోసం కృషి చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఆర్.రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావును కలెక్టర్ అభినందించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 150 మెడికల్ సీట్లతో 2023 ఆగస్టు నుంచి తొలిబ్యాచ్ విద్యార్థులతో వైద్య కళాశాల కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల బదిలీ

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నుంచి పలువురు సిబ్బందిని ద్వారకాతిరుమల, సింహాచలం, శ్రీకాళహస్తి దేవస్థానాలకు బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వి.నూకరత్నాన్ని శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో శ్రీశైలం దేవస్థానం నుంచి ఎం.నర్సింహారెడ్డిని నియమించారు. డీఈఈ ఆర్‌బీవీఎస్ సుధాకర్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. ఏఈఓలు వైవీవీఎస్ భ్రమరాంబ ను సింహాచలం దేవస్థానానికి, లింగంపల్లి శ్రీనివాసరావును ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. సూపరింటెండెంట్లు కె.సతీష్‌ను ద్వారకా తిరుమల దేవస్థానానికి, యనమల అప్పారావు, బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్, పి.వెంకటరమణను సింహాచలం దేవస్థానాలకు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లు పసుపులేటి రమేష్‌బాబును సింహాచలం, కంచిభట్ల రాంబాబును ద్వారకా తిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్లు కె.రమేష్ బాబు, ఎస్.సందీప్‌గౌడ్‌లను సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ఆత్రేయపురం: మండల పరిధిలోని వెలిచేరు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే 30 మంది ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జున తెలిపారు. దీంతో ఫస్ట్ ఎయిడ్ నిర్వహించి ఆత్రేయపురం పీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు. వైద్యాధికారి వై.సుస్మిత వైద్య సేవలు అందించారు. సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల వెంకన్న బాబు, ఎంపీడీవో నాతిబుజ్జి, ఏపీడీ నాగవర ప్రసాద్, ఏపీవో భారతీ ఉపాధి కూలీలను పరామర్శించి ఆరోగ్యం గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ఏవిధమైన ప్రమాదం లేదన్నారు.